
# ఎ టిపికల్ సీన్

కె.రామలక్ష్మి

'ఇంత పొద్దుటే ఎవరై వుంటారబ్బా?!' అనుకుంటూ ఫోను ఎత్తాను. 'హల్లో' అనే లోగానే అవతల వైపు నుంచి సీనియర్ సిటిజెన్స్ హోమ్ వార్డెన్ మరకతం కంఠం ఆత్రంగా. "మిసెస్ లక్ష్మి ఓ సారి అర్జెంట్‌గా బయలుదేరి వస్తారా! మీ మేడమ్ యీజ్ సింకింగ్" అంది.

"వాట్! మొన్న బాగానే వున్నారు కదా?" భయంగా అడిగాను.



"మొన్నటికీ యివాల్టికి ఎనభై ఏళ్ల మనిషిలో చాలా మార్పు రావచ్చు మిసెస్ లక్ష్మి" పేలవంగా నవ్వింది వార్డెన్.

"మీరు వారబ్బాయి విక్టర్‌కి ఫోను చేశారా?"

"చేశాను. భార్యని తీసుకు వస్తున్నానన్నాడు. మీరు రండి. మీకు మాకూ కూడా తెలును ఆవిడకి మీరంటే చాలా ఇష్టం అని."వస్తున్నా" అని ఫోను పెట్టేశాను.

ఏమిటో చాలా సేపు ఫోను కేసి చూస్తూ కూర్చుండి పోయానో ఏమో./అదేమిటమ్మా! ఫోనుని హిప్నొటైజ్ చేస్తున్నట్టు కూర్చున్నావ్. బాడ్ న్యూసా?" అడుగుతూ భుజం మీద చేయి వేశాడు నా కొడుకు. ఉలిక్కి పడ్డాను.

"ఏం జరిగిందమ్మా. వై? అంత ఉలిక్కి పడ్డారు" పక్కనే కూర్చుంటూ నా చేయి అందుకుని.

"ఏం లేదురా మిసెస్ జకరియా చాలా సిక్‌గా వున్నారని ఫోను. నేను త్వరగా బయలుదేరి వెళ్ళాలి" అంటూ లేచాను.

"నాన్న ఇంకో గంటలో టూర్ నుంచి వస్తున్నారు. మరిచిపోయేవా." కాస్త నిష్ఠూరం ధ్వనించిందా వాడి గొంతులో అనిపించకపోలేదు. కాని వాడి ముఖంలోకి చూసి "కాస్త నువ్వు చూసుకో ఈ పూటకి." అంటూ గబగబ స్నానానికి బయలుదేరాను.

గోపి కాస్త గొణుక్కున్నట్టు అనిపించింది గాని, నాకవేం వినబడడంలేదు. మిసెస్ జకరియా పిలుపే వినిపిస్తోంది.!

"కమ్. కమ్ లక్ష్మి... ఈ వారంలో ప్రపంచంలో ఏమైందో చెప్పు" అంటూ నా చెయ్యి గట్టిగా పట్టుకుని పక్కనే కూర్చోపెట్టుకునే మిసెస్ జకరియా పిలుపు మాత్రమే వినిపిస్తోంది.

"నేను ఆటోలో వెళ్తున్నాను గోపీ. నాన్న వచ్చినా కారుకి ఇబ్బంది పడక్కరలేదు. నువ్వు కాస్త ఆగి నాన్న వచ్చాక వెళ్లు అంతే. సరేనా!" అంటూ హాండ్‌బాగ్ అందుకుని వీధి గుమ్మం దాటాను.

ఆటోలో కూర్చున్నానన్న మాటే గాని నా మనస్సు నా విద్యార్థి దశకి పరుగులు తీస్తోంది.., కాలేజిలో కూడా ఈ మోరల్ ఇన్‌స్ట్రక్షన్ ఏమిటి. వాట్సెన్స్, అంటూ అందరూ విసుక్కునే వారే-మిసెస్ జకరియా క్లాసంటే తెలివిగా ఈవిడ పీరియడ్ సెకండ్‌ది. మొదటిదై వుంటే చాలామంది ఆలస్యంగా రావడమో అటూ యిటూ తిరుగుతూ-కాలక్షేపం చెయ్యడమో చేస్తారని మేనేజ్‌మెంట్‌కి బాగా తెలుసు. అంతా మదర్స్. నీతినియమాలకి క్రమశిక్షణకి కట్టుబడి వుండడం ఒక్కటే ముఖ్యమైన మానవలక్షణం అని మిసెస్ జకరియా





ఎప్పుడూ తన క్లాసు మొదలు పెట్టేది. గుసగుసలు చెలరేగి క్లాసురూంలో చిన్న సముద్రపు కెరటపు హోరులాగా విస్తరించేది. 'హాకు తెలుసు. మనం కోతి నుంచి క్రమంగా తెలివి మీరి రూపాంతరం చెందిన జాతి కదా!

కానివ్వండి. మీ గుసగుస సద్దుమణిగాక నాలుగు మాటలు చెప్పకుందాం' అనేది. దాంతో సిగ్గుపడి క్లాసంతా సైలెంట్ అయి పోయేది.

రానురాను జకరియా క్లాసు బోర్ అని అర వడం తగ్గిపోయింది. ఆమె నీతి బోధ చేసేది కాదు. మతం దాని ప్రాబల్యం గురించి మాట్లా డేది కాదు. కాని క్లాసుని హిప్నోటైజ్ చేసి కూర్చునే లాగా చేసేది. ఆమె ఎప్పుడూ మనిషిని గురించీ మానవత్వం గురించే చెప్పేది. ఆమె మాటల్లో ఎప్పుడూ ఈ మతం గొప్ప. ఆ మతం తక్కువ అన్న మాటనే నామె దగ్గిర చదువుకున్న నాలుగేళ్లలో వినలేదు. మా మధ్య సడెన్‌గా ఆమె ప్రాముఖ్యం చాపకింద నీరులాగా విస్తరించి పోయిందా అని పించేది.

ఆమె రిటైరై వెడుతున్న రోజున యూనియన్ సెక్రటరీగా నేను మాట్లాడుతున్నప్పుడు నాకు తెలియ కుండానే నా కళ్ళు వర్షించసాగాయి. ఆమె మాట్లాడుతూ "నేను మిమ్మల్ని ఒత్తిడి చేసి నీతులు బోధించలేదనే అనుకుంటున్నాను. ఈ సంఘంలో మనిషినీ మనిషినీ కట్టి పడేసేది డబ్బని నాకు తెలియకపోలేదు. కాని దాని కంటే బలంగా కట్టి వేసేది మమత, అనురాగం, ఆప్యాయత, సమాజంలో ఎవరెలా వున్నా ఎవరికివారు నీతిని యమాలు, సాటివాని పట్ల సానుభూతి మరిచి

పోకుండా వుంటే నా దృష్టిలో అలాంటి వాళ్ళంతా ధనవంతులే" అన్నారు. "మేడమ్ మీరు చెప్పకుండానే మాకు ఎన్నో సంగతులు చెరగని ముద్ర వేసేలాగా చెప్పారు. మేం మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోలేం. మీరు... మీరు ట్రూ క్రిస్టియన్ మేడమ్" అని చెప్తూంటేనే నాకు దుఃఖం వచ్చేసింది. ఆమె కంత ఆప్యాయత దక్కింది కాలేజీలో.

తర్వాత కూడా నాకామెతో పరిచయం పోలేదు. అడపా తడపా కలుసుకునేదాన్ని. చాలా కాలం ఆమెవారి మతసేవలో గడిపారు. బాగా ముసలివారై పోతున్నారు. "ఎందుకింత సడెన్‌గా మీలో యింత మార్పు మేడమ్. డాక్టర్ని చూశారా? హేపీగా లేరా?" అంటూ అడిగేదాన్ని. నవ్వి నా భుజం మీద చేయివేసి దగ్గిరికి తీసుకుంటూ 'హేపీనెస్ షుడ్ బి హియర్' అంటూ గుండెల మీద చేయి పెట్టుకుని చూపించారు. తర్వాత నేను చూసినదామె నీ హోమ్ లోనే. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మంచి ఉద్యోగంలో వున్న కొడుకు, కోడలు, ఇద్దరు మనవలు కూడా వున్నారు.

నేనదే ఆమెను అడిగాను. ఆమె ఏమీ అనలేదు కొంతసేపు-ఆవిడ లక్షణాలలో నేరాలు చెప్పే గుణం అస్సలు లేదు. "నా వయస్సు వాళ్ళ మధ్య నేను హేపీగా వుంటాను లక్ష్మీ-ఎలా వున్నావు! ఎప్పుడేనా వచ్చి లోకం గురించి చెప్పి వెళ్తూ వుండు" అన్నారంతే.

ఈ రోజు ఉదయాన్నే యీ వార్త నన్నొక్కసారి కుదిపేసింది. గతం అంతా ఒక్క త్రుటిలో చెరిగిపోయి వర్తమానం కళ్ళెదుట నిలబడింది.

ఆటో వాడికి డబ్బులిచ్చి లోపలికి వెళ్ళాను. నేనక్కడి చాలా మందికి పరిచయస్తురాలినే. ఇదిగో యీ మిసెస్ జకరియా మూలంగానే వెలవెలా అల్లా వారం వారంగా మారిపోయింది నా విజిట్. వాళ్ళేమేనా చెప్తే లిస్టురాసుకుని మరిచిపోకుండా పట్టుకెళ్ళేదాన్ని. కాని మిసెస్ జకరియా అవసరాలు అతి తక్కువ. ఆవిడకళ్ళు బాగా మసగ కమ్మాయి. అద్దాల లోంచి కూడా బైబిల్ చదువుకోవడం కష్టంగా వుందన్నారు. నేనోసారి పుస్తకం పేజీ మీద పెట్టుకుని చదువుకుందుకు వీలుగా వుంటే భూతద్దం పట్టుకెళ్ళియిచ్చాను. సంతోషంతో ఆమె వెలుగు తగ్గిన కళ్ళు మెరిసాయి. "గాడ్ బ్లెస్ యూ" అంటూ నా తల నిమిరారు. ఆమె బైబిల్ ఒక్కటే - చదువుకునే వారు. గాప్ అండ్ గాప్ అండ్ గాసిప్ చదివి వినిపిస్తే నవ్వుకునేవారు. అంత వ్యక్తిత్వం కల మిసెస్ జకరియా ఈ రోజు నిస్సహాయంగా మళ్ళీ వ్యాన్ కోసం ఎదురు చూస్తూందంటే... బాధ అనిపించింది.

"కొడుకూ కోడలు రాలేదా?" అడిగాను.

×"మమ్మీ దీపావళి ఎందుకు చేస్తారో నాకు తెలిసిపోయింది!"
"చెప్పు చూద్దాం?"
"పండుగ చెయ్యకపోతే టపాకాయలన్నీ వేస్టయిపోతాయిగా మరి"
-జె. రఘుప్రసాద్,

"మీకు ఫోన్ చేసినప్పుడే చేశాం. వస్తానన్నాడు వాళ్ళబ్బాయి. మీరు కూర్చోండి" అంది వార్డెన్.

"రోజులాగే స్నానంచేసి మంచి చీర కట్టుకుని టిఫెన్ తినడం కూడా ముగించి.. రూంలో వాలు కుర్చీలో పడుకున్నారు. అలవాటు ప్రకారం బైబిల్ చదువుకుంటున్నారు.. కాని పనిపిల్లలు కేకవేశారు యీవిడ ఎలాగో వున్నారు. తలవాలి పోయిందని.

మేం అంతా వెళ్ళాం. పల్సు చూశాం హార్టు చూశాం. మంచం మీద చేర్చాం. డాక్టరు కూడా వచ్చి చూశాడు. ఏం అనలేదు.. అందుకే"

నే నామె పక్కగా స్టూలువేసుకు కూర్చున్నా.

ఆమె పెడుతున్న గురక-సముద్రపు హోరులాగా వుంది. కళ్ళు అప్పుడప్పుడూ, తెరుస్తున్నారు. ఎవరి కోసమో వెదుకుతున్నాయా ఆ కళ్ళు అనిపించి "విక్టర్‌కి ఫోను చేశారు మేడం, వస్తూ వుంటాడు.. మీరు బాగవుతారు. ధైర్యం కోల్పోకండి" అన్నాను. నన్ను భయం పీడిస్తున్నా కూడా.

ఇంతలో గది కవతల హడావిడి వినిపించింది. నేను గడియారం చూసుకున్నా-అప్పుడే నేను ఆమె పక్కన కూర్చుని మూడు గంటలకు పైగా అయింది. "కొడుకూ కోడలూ వచ్చారండీ"

వార్డెన్ మాట పూర్తి కాలేదు. నేను స్టూలు మీద నుంచి లేచే ప్రయత్నంలో వుండగానే గది అవతల నుంచే లోపలికి తొంగి చూశాడు విక్టర్.

"కమ్ ఇన్. నీ కోసం ఆమె ఆశగా ఎదురు చూస్తున్నారు" అన్నా.

అతను గబుక్కున వెను తిరిగాడు.

వార్డెన్ మీద విరుచుకు పడ్డాడు. "ఇదంతా ఓ నాటకం! షి యీజ్ ఎ హిపోక్రైట్! నాటకం ఆడుతోంది. చూస్తే తెలియడంలేదు! ఇలా చేస్తే భయపడి యింటికి తీసుకెళ్ళిపోతానని. మీకేం తెలుసు ఆవిడ గురించి.

నా పని పాడు చెయ్యకండి. నిజంగా పోయినప్పుడు చెప్పి పంపండి" అందరూ తేరుకునే లోగా అతగాడు బూట్లు టకటక శబ్దం చేసుకుంటూ వరండా చివరదాకా వెళ్ళిపోయాడు.

"చూడండి వార్డెన్! ఇలాంటి చికాకులు విక్టర్ మూడ్ పాడు చేస్తాయి. మీరు కాస్త ఆగిపోయి చేసి వుండవలసింది!" అనేసి మిసెస్ విక్టర్ హైహీల్సు చప్పుడు చేసుకుంటూ భర్తని అనుసరించింది. వార్డెన్ స్తబ్ధు అయి అలాగే నిలబడిపోయింది. ఇదంతా నిమిషాల మీద జరిగిపోయింది.

ఒక విధమైన విషాదపు నీడ అక్కడంతటా విస్తరించింది. మిగిలిన గదుల్లోని వాళ్ళు.. ఈ చోద్యం గురించి రకరకాలుగా మాట్లాడుకుంటూ ముగ్గురూ నల్గురూ కలిసి వరండాలో అక్కడక్కడా ఒదిగి నిలబడ్డారు. వాళ్ళ బుర్రల్లో కదలాడుతున్న ఊహలు వాళ్ళు చెప్పక్కర లేకుండానే వాళ్ళ ముఖాలు అద్దం పడుతున్నాయి!

నేను లేవబోయిన దాన్ని స్టూలు మీద తిరిగి కూలబడ్డ మిసెస్ జకరియా చేయి నా చేతిలోకి తీసుకుంటూ "మేడమ్ విక్టర్ వచ్చాడు. చూశారా?" ఆత్రంగా అడిగాను. కాని ఆమెలో చలనం లేదు. గుండెల్లోంచి గురక శబ్దమూ లేదు!

"మేడమ్ చూడండి. మీకేం భయంలేదు. వార్డెన్ ఆస్పత్రికి తరలిస్తారు. నేనుంటాను మేడమ్ మీతో సాయానికి.." అంటూనే వున్నాను. కాని తెలుసు ఆమె ప్రాణం పోయింది! చేతిలో బైబిల్ పక్కలోకి జారిపోయింది.

"ఆమె పోయిందమ్మా. షి యీజ్ ఎ లక్కీ ఉమెన్." అంది ఆమె కళ్ళు చాలా మృదువుగా మూస్తూ.

"విక్టర్ మాటలు విన్నా రంటారా?" భయంగా అడిగాను.

"మేబి ఎలా తెలుస్తుంది! తల్లి కదా. కొడుకు రాక కోసం ప్రాణ నిలువుకొంది కాబోలు.. లెట్ యిట్ బి. నిజంగా అదృష్టవంతురాలు. వాడి మాటలామె చెవిన పడకుండా వుండి వుంటే" అన్నారు వార్డెన్ తిరిగి విక్టర్‌కి ఫోను చేయాలని వెడుతూ.

'పాపం! ఆ మాటలామె వినకుండా వుంటే ఎంత బాగుండేది' అని ఒకటికి పదిసార్లు అనుకున్నాను.

'వినే వుంటుంది. కాకుంటే అంత త్వరగా ఎలా పోయింది? అయినా అదేం కొడుకు? తల్లి చావుని నాటకం అంటాడేమిటి?'

బుగ్గలు నొక్కుకుంది మిసెస్ జకరియాను చూసుకునే పనిమనిషి.

'యింత గడ్డి పెట్టేవాళ్ళు లేక? ఆ తల్లికి పుట్టవలసిన వాడు కాదా కొడుకు!' విసుక్కుంది. ఓ మనిషి.

× × ×

తలుపు తెరచుకుని ముందు గది లోకి అడుగు పెడ్తూ వుండగానే ఫోను మ్రోగడం చూసి 'మళ్ళానా!' అంటూ విసుగ్గా రిసీవరెత్తి హల్లో అన్నాడు విక్టర్.

"సారీ మీకు మళ్ళీ ట్రబులివ్వక తప్పడంలేదు. మిసెస్ జకరియా కొద్ది నిమిషాల క్రిందటే చనిపోయారు. ఇది నాటకం కాదు. పచ్చి నిజం. ఏం చెయ్యమంటారు?" వచ్చిన కోపాన్ని అదిమి పట్టుకుంటూ చాలా సౌమ్యంగా అడిగారు వార్డెన్.

"నేనో అరగంటలో ఏర్పాట్లతో వస్తాను. ప్లీజ్ మీ ఆఫీసులో చెప్పండి డిపాజిట్ రిఫండ్ చెక్ అవీ సిద్ధం చేయమని." మళ్ళీ యింకో మాట అంటానికి అవకాశం యివ్వకుండా విక్టర్ ఫోను పెట్టేశాడు.

విక్టర్ కాఫిన్‌తో సహా ఆఫీసు గది ముందు ఆగాడు. బాడీ మీద పూలుంచి అంతా పక్కగా నిలబడ్డారు. మిసెస్ జకరియా ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుగా వుంది కానీ చనిపోయినట్టు అనిపించలేదు.

ఆఫీస్ హెడ్ క్లర్క్కు గారు శుద్ధ అయ్యరుగారు.

చిన్న కొబ్బరి కాయింత కుడిమి నిగనిగలాడుతూ వుంటుంది మెడ వెనక.

కావలసిన చోట్లంతా సంతకాలు తీసుకుంటూ యిక ఆనలేకుండా వుండలేకపోయారో ఏమో.

"మిస్టర్ విక్టర్, నీలాంటి కొడుకునీరోజు చూస్తున్నాను. చాలా మందికి గుణపాఠం సుమా నువ్వు!" అంటూ చెక్కు అతని ముందుకి తోశారు.

విక్టర్ మాట్లాడలేదు. చెక్కు తీసి కోటు జేబులో పెట్టుకుంటూ 'థాంక్యూ' అని వాన్ని పోనీమన్నాడు. పాటి ముసలివాళ్ల గుండెల్లో కొత్తగా మళ్ళీ బండరాయి పడినట్టయిందీ దెబ్బతో.

అదృష్టవంతురాలు అని అందరూ అనుకునే వాళ్లే. తమ కెలాటి చావొస్తుందో నన్న భయం దోబుచులాడుతూంది వాళ్ల ముఖాలలో.

"నేను వెళ్లి వస్తాను"అన్నా వార్డెన్‌కి చేయి అందిస్తూ.

"జకరియా పోయిందని రావడం మానెయ్యకేం" అన్నారామె నా భుజం తడుతూ. "ఇంకా చాలా మంది జకరియాలు లున్నారు ఇక్కడ మరిచి పోకు" అన్నారు. నా కళ్ల నీళ్ళు వచ్చాయి.

వార్డెన్ ఆటో పిలిపించి పెట్టారు.

ఇల్లు వచ్చింది కూడా తెలియలేదు.

ఇంట్లో ఆయన హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు.

"వచ్చావా? ఎలావున్నారామె?" చాలా అనునయంగా ఆయన అడిగేసరికి నాకు దుఃఖం కట్టలు తెంచుకుంది. ముఖం చేతుల్లో దాచుకుని ఏడ్చేశాను.

"కొడుకు వచ్చాడా?"నన్ను ఓదారుస్తూ అడిగారు.

"రాకపోయినా బాగుండేదండీ.. వచ్చాడు." ఇక ఎలా చెప్పాలో చెప్పినా నమ్ముతారో లేదో అన్న అనుమానంతో ఆగిపోయాను.

"కమాన్ లక్ష్మి. ఆమెకేం లోటు? జీవితం పూర్తిగా అనుభవించిన పండిన పండు రాలి పోక తప్పదు కదా. కడసారి కొడుకును చూసుకున్న తృప్తి కూడా దక్కింది"అన్నారు.

"లేదండీ లేదు వాడేం కొడుకండీ 'ఇదంతా డ్రామా! ఇలా చేస్తే యింటికి తీసుకు వెడతామని' అంటూ చాలా అల్పబుద్ధితో మాట్లాడి పోయాడండీ. వేనా సందడిలో ఆమె ఆ వాగుడు విందో లేదో గమనించలేదండీ! వినకుండా వుంటే ఎంత బాగుండును"కళ్ళు వత్తుకుంటూ అన్నాను.

ఆయన భుజం చుట్టూ చేయివేసి దగ్గిరకి తీసుకుంటూ.

"వినలేదని నమ్ము లక్ష్మి అది నీకు బాగుంటే. షి యీజ్ గ్రేట్. ఏ ఆశతో క్షణాలు లెక్కపెట్టుకుంటూ వూపిరి నిలువుకుందో ఆ క్షణంలో ఆశ తీరగానే ప్రాణం వదిలింది."

"వై? అమ్మెందుకలా వుంది?"అంటూ లోపలికి వస్తున్న గోపీని నిదానించి చూసింది లక్ష్మి.

"ఏమిటి అలా చూస్తున్నారు? కొంపతీసి మీ మోరల్ మేడమ్ పాఠాలు నాకు ప్రారంభించరు కదా!"నవ్వుతూ కుర్చీలో కూలబడుతూ షూజ్ విప్పకోడం ప్రారంభించాడు గోపీ.

వంగి వున్న వాడి తలకేసే చూస్తూ.

"నెవ్వర్! నెవ్వర్ గోపీ. నేను మిసెస్ జకరియాని కాలేను.

నేనీ రోజు మొదలు స్వార్థ జీవిగా మారిపోవాలని నిర్ణయించుకున్నాను. భయపడకు" అంటూ లేచిలోపలికి చక్కాపోతున్న తల్లిని చూసి 'ఏమైంది?' అన్నట్టు తండ్రి కేసి చూశాడు గోపీ.

"ఈ రోజు మీ అమ్మ ఓ టిపికల్ సన్‌ని చూసి వచ్చిందంతే" అన్నారాయన.

*